6MN 7_6MN 7.qxd 6/4/2026 1:41 AM Page 1



## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



గుంటూరు, జూన్ 3 ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఘన స్వాగతం పలికారు. లలితా పివిఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి హెలిపాడ్ వద్ద జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## బొల్లా భూ దందాలో న్యాయవాది ఎం.ఎన్ ప్రసాద్ హస్తం

*- వినుకొండలో న్యాయవాది ఎం.ఎన్ ప్రసాద్ అరాచకాలు*

*- వైకాపా నేతల తీరుపై తెదేపా నేతల ధ్వజం*



వినుకొండ, జూన్3, ప్రభాతవార్త: హైదరాబాద్ గండికోటలో 1500 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి అప్పనంగా కాజేసేందుకు ఫేక్ జీవోలు పుట్టించి, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన కేసులో అడ్డంగా దొరికిన వైసిపి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భూ దందాను వైసిపి నాయకులు ప్రోత్సహిస్తూ మాట్లాడటం చట్ట విరుద్ధమని టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక చీఫ్ చెప్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడారు. బ్రహ్మనాయుడు చేసిన భూదందా రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కాగా వినుకొండలో వైసిపి నాయకులు భూ దందాని సమర్థిస్తూ పలు ఆరోపణలు చేయటం దుర్మార్గ చర్య అన్నారు. న్యాయవాదిగా ఉన్న ఎం.ఎన్.ప్రసాద్ అన్యాయంగా అక్రమాలను సమర్థిస్తూ మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు చేసిన భూ దందాలో నీ వాటా ఎంత అని ఎం.ఎన్.ప్రసాద్ను టిడిపి నాయకులు ప్రశ్నించారు. న్యాయవాది ముసుగులో ఎన్నో అరాచకాలకు పాల్పడిన ఎంఎన్ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడమే అన్నారు. నీ గురువు రాజారావు కుటుంబాన్ని ఎలా నాశనం చేశావో ప్రజలందరికీ తెలుసు అన్నారు. పేదల నివాసముంటున్న సురేష్ మహల్ రోడ్డులో నీవు ఆక్రమించిన రోమను ఖాళీ చేసినట్లు నటించి, నాడు బ్రహ్మనాయుడు దుర్మార్గంగా పేదల నివాసాలు తొలగిస్తే కోర్టును ఆశ్రయించి రక్షించుకుంటే నీవు తొలగించిన షాపు మరల నిర్మించుకొని 25000 అద్దెకు ఇవ్వటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రజా వైద్యుడు డాక్టర్ రాధాకృష్ణకు సంబంధించిన సిద్ధార్థ నగర్ లో మూడు ఎకరాల భూమిని నీవు ఆక్రమించుకుంటే డాక్టర్ కోర్టుకు వెళ్లి తన భూమిని గెలుచుకున్న వాళ్లను చంపేస్తానని బెదిరించి నీవు డాక్టర్ మానసిక మరణించేందుకు కారణం కాలేదా అని ప్రశ్నించారు. మార్కాపురం రోడ్డులో రజకుల భూమి అప్పనంగా కాజేయడమే కాకుండా, పట్టణంలో పట్టా వారి ఆస్తులను బ్రహ్మనాయుడుని అడ్డం పెట్టుకొని బెదిరించి చౌకగా కొట్టేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైసిపి పాలనలో ఎమ్మార్వో అని ఇంట్లో పెట్టుకుని రెవిన్యూ రికార్డు ట్యాంపరింగ్ చేసి విలువైన ఆస్తులను ఆక్రమించుకొని అమ్ముకొని సొంతం చేసుకున్న వ్యక్తి వని ఎమ్ ఎన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీఎన్ జయప్రద బంగ్లా భూమిలో చౌకగా కొనుగోలు చేసి లక్షలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్న వ్యక్తి ఎం ఎన్ ప్రసాద్ అని దుయ్యమట్టారు. ఇలా న్యాయవాది ముసుగులో ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారులు అడ్డం పెట్టుకొని నీవు చేసిన అరాచకాలు కోకోనలుగా ఉన్నాయని, ఇలాంటి వ్యక్తి ప్రజాసేవకుడు, నిజాయితీపరుడైన జీవి ఆంజనేయులును, కూటమి నాయకులను విమర్శించడం సరికాదని మీ స్థాయిని మరిచి మాట్లాడితే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు పెమసాని నాగేశ్వరరావు, పల్లె మీసాల దాసయ్య, పివి సురేష్ బాబు, మురళి, గంధం కోటేశ్వరరావు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయండి : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జూన్ 3, ప్రభాతవార్త: ప్రజల సహకారం, ప్రత్యామ్నాయ వనరుల వినియోగంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం... ఘన వ్యర్థాల సేకరణ, నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు పాలుపంచుకునేలా ప్రత్యేక విధివిధానాలు రూపొందించండి... రోడ్లు, డ్రైనేజ్ లు, పార్కులు, ఆటస్థలాలు, శ్మశానవాటికలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోండి... పట్టణాభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్తిపాటి సమీక్ష.పట్టణాభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలని, వారి ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి జరగాలని, అదేవిధంగా వ్యర్థాల సేకరణ, నిర్వహణ... పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంలోనూ వారి భాగస్వామ్యం ఉండేలా చూడాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణాభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. సమీక్ష అనంతరం ప్రత్తిపాటి పట్టణంలోని 38వ వార్డు, ఎన్టీఆర్ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని స్వయంగా పరిశీలించారు.చేసే అభివృద్ధితో ప్రజల్లో గుర్తింపు.. ప్రభుత్వ కృషికి సార్థకత లభించాలిపట్టణ సమగ్రాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందించే నిధుల్ని సద్వినియోగం చేసుకోవడంలో, ప్రజల అవసరాలు తీర్చడంలో అన్ని విభాగాలు పోటీపడాలని ప్రత్తిపాటి సూచించారు. నివాసాలున్న చోటే రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని, ప్రజలకు ఉపయోగపడితేనే అధికారుల కష్టం, ప్రభుత్వ కృషికి తగిన గుర్తింపు, సార్థకత లభిస్తాయన్నారు. రోడ్లు, డ్రైనేజ్ లు, పార్కులు, ఆటస్థలాలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. అన్ని మతాల శ్మశాన వాటికల ఆధునీకరణ పనులు వేగంగా నిర్దేశిత గడువులోపే పూర్తి కావాలన్నారు. తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలు పదేపదే పునరావృతం కావడానికి వీల్లేదని, ఆర్.డబ్ల్యూఎస్ విభాగం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందాలని, తదనుగుణంగా యంత్రాంగం నిబద్ధత, ముందు చూపుతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. రోడ్లపై, కాలువల్లో ఎక్కడా చెత్త కనిపించ కూడదని, బాధ్యతరాహిత్యంగా వ్యవహరించే పౌరులు, దుకాణదారుల ఆలోచనల్లో మార్పు వచ్చేలా చూడాలన్నారు. 15వ ఆర్థిక సంఘం, మైనింగ్ గ్రాంట్ నిధులతో బాగా దెబ్బతిన్న రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోటే కొత్తవి నిర్మించాలని చెప్పారు. అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమీక్ష సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివ రావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డిఇ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు, జంగా వినాయకరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఇ, ఏసిఇల నియామకం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్3, ప్రభాతవార్త: ఏఎన్యులో సిఇగా ఎ.వెంకటేశ్వర్లు, ఏసిఇగా రెడ్డి ప్రకాష్లు బుధవారం నియమితులయ్యారు. వీరిని నియమిస్తూ వీసి ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వీరిరువురికి నియామక పత్రాలు అందజేశారు. సిఇ, ఏసిఇలు సమన్వయంతో విద్యార్థులకు సేవలు చేయాలని సూచించారు. అలాగే షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహణ, ఫలితాలు విడుదల వంటి విషయాల్లో ఖచ్చితత్వం పాటించాలన్నారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, వికాస కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, నాగలక్ష్మీ, కె.భానుప్రసాద్, ఇంజనీర్ కుమార్రాజాలు అభినందనలు తెలిపారు. అనంతరం సిఇగా వెంకటేశ్వర్లు, ఏసిఇగా రెడ్డి ప్రకాష్లు బాధ్యతలు స్వీకరించారు. వీరికి వై.రాధాకృష్ణ, ఉద్యోగులు, వికాస నాయకులు, పరిక్షా భవన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాత పదవులు కంటిన్యూ

వర్సిటీలో జోడు పదవులు అధ్యాపకులతోపాటు నాన్ టీచింగ్లో కూడా కంటిన్యూ అవుతున్నాయి. ప్రస్తుతం సిఇగా నియమితులైన వెంకటేశ్వర్లు ఇన్చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్గా, రెడ్డి ప్రకాష్ నోడల్ ఆఫీసర్గా పాతపదవులను కంటిన్యూ చేయడంపట్ల పలువురు ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. వీరికి అధనంగా ఉన్న రెండు పదవులను ఇతరులకు కేటాయించి సమన్యాయం చేయాలని కోరుతున్నారు.

# అమరావతి వార్త



## సీఎంకు ఘన స్వాగతం పలికిన ఏపీఐడిసి చైర్మన్



గుంటూరు జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి :గుంటూరు నగర శివారు తక్కెళ్లపాడులోని లలిత పీవీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హెలిప్యాడ్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం హాస్పిటల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని లలిత హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాఘవ శర్మ దంపతులకు, వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ల్యాండ్ మార్క్ సంస్థగా..

# లలితా పివిఎస్ హాస్పిటల్..!



*- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు*

*- 35 వసంతాల విశ్వసనీయ వైద్య సేవలు*

*- 15 లక్షల మంది పేషంట్లకు అందిన చికిత్స*

*- 99.5 శాతం సక్సెస్ రేటుతో గుండె ఆపరేషన్లు*

*- మొట్టమొదటి అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్గా దేశంలోనే గుర్తింపు*

*- సీఎం చేతుల మీదగా లలితా హాస్పిటల్ గొప్ప ప్రారంభం*

గుంటూరు జూన్ 3 ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు నగరంలో గత 35 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తూ విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచిన లలితా హాస్పిటల్ యాజమాన్యం నూతనంగా నిర్మించిన లలితా పివిఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు







బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా లలితా పీవీఎస్ ఆసుపత్రి అంతా కలియతిరిగి సీఎం పరిశీలించారు. 600 పడకలతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన లలితా ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. మొత్తంగా 32 విభాగాలకు సంబంధించి ఒకేచోట వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లలిత ఆస్పత్రి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సీఎం ఆకాంక్షించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ లలితా హాస్పటల్స్ యాజమాన్యం అత్యాధునిక వైద్య సేవలతో గుంటూరులో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో కాకుండా అమరావతిలో ఆస్పత్రిని నెలకొల్పిన లలిత యజమాన్యాన్ని అభినందించారు. దశాబ్దాలుగా వైద్య రంగంలో లలితా గ్రూప్ ఉందని గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదు అనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనమని తెలిపారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలని అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ ఏర్పడుతుందని అన్నారు. ఏడు ఎకరాల్లో 600 పడకలతో లలితా ఆసుపత్రి ఏర్పాటైందని.. 32 విభాగాలకు సేవలందించే ఏకైక సెంటర్ అని సీఎం తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారని పేర్కొన్నారు. ల్యాండ్ మార్క్ సంస్థగా లలితా ఆసుపత్రి మారుతుందని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు.లలిత హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవా నిరతితో, మానవతాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. హృదయ సంబంధిత వ్యాధులతో ఏటా 32 శాతం మంది మరణిస్తున్న నేపథ్యంలో, ఆయా వ్యాధులను గుర్తించే ఖరీదైన ఆధునిక పరికరాలను లలిత హాస్పిటల్స్ లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. 3.5 దశాబ్దాల లలితా హాస్పిటల్ సుదీర్ఘ ప్రస్థానం ఇలా 1990 వ సంవత్సరంలో డాక్టర్ పి.వి రాఘవ శర్మ, డాక్టర్ పి. విజయ దంపతుల చేతుల మీదగా కేవలం రెండు పడకలతో ప్రారంభమైన లలితా హాస్పిటల్ గత 3.5 దశాబ్దాలుగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచింది. దేశంలోనే మొట్టమొదటి హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటర్గా గుర్తింపు సాధించింది. ఈ దంపతులు గత 35 సంవత్సరాలుగా 15 లక్షల మంది పేషంట్లకు వైద్య సేవలు అందించారు.99.5 శాతం సక్సెస్ రేటుతో 7,500 గుండె ఆపరేషన్లు చేశారు.లక్షల మంది పక్షవాతం రోగులకు చికిత్స అందించి దేశంలోనే మొట్ట మొదటి స్ట్రోక్ సెంటర్ గా లలితా హాస్పిటల్ ఖ్యాతి గడించింది. విజయవంతమైన1.5 లక్షల కార్డియక్ ప్రొసీజర్లు, 40 వేల ఏంజియో ప్లాస్టిలు, 30 వేల ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు,5 వేల సెరిబ్రో ల్యాస్కులర్ ప్రొసీజర్లతో దేశంలోనే అత్యుత్తమ గుర్తిం పు సాధిం చింది. 2008లో లలితా ఎడ్యుకేషనల్ అకాడమీ స్థాపించి ఎంతో మంది మెడికల్ ప్రొఫెషనల్స్ , బిఎస్సి నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిని తయారు చేసి రాఘవ శర్మ దంపతులు అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. డాక్టర్ విజయ అందించిన సేవలకు గాను 2010లో ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా బంగారు బహుమతి లభించింది. డాక్టర్ రాఘవ శర్మ చేసిన సేవలకు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ప్రశంసా పత్రం దక్కింది. వీటితో పాటు లలితా గ్రూప్ అనేక అవార్డులు పొందింది. నమ్మకానికి, నాణ్యతకు, విశ్వసనీయతకు శిఖరంలా నిలిచిన లలితా హాస్పిటల్ యాజమాన్యం నేడు అత్యాధునిక సదుపాయాలతో, ఇన్నోవేషన్, మరింత కంప్యాషన్తో లలితా పీవీఎస్ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నూతన ఆసుపత్రిని ప్రారంభించింది. అత్యాధునిక సదుపాయాలతో లలితా పీవీఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యాధునిక సదుపాయాలతో నూతనంగా నిర్మించిన లలితా పీవీఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిని ప్రారంభించారు. పూర్తి పచ్చదనంతో నిండిన 7 ఎకరాల విస్తీర్ణంలో 600 పడకలతో, మల్టీ స్పెషాలిటీ సేవలు అందించే విధంగా ఈ ఆసుపత్రిని నిర్మించారు. డాక్టర్ రాఘవ శర్మ , డాక్టర్ విజయ దంపతుల స్ఫూర్తిదాయకమైన నాయకత్వంలో డాక్టర్ పి. అనురాగ్, డాక్టర్ బి. స్రవంతి , డాక్టర్ పి. నరేన్ , డాక్టర్ జి. శిరి చందన అనే నలుగురు యంగ్ అండ్ డైనమిక్ వైద్యులు ఈ నూతన ఆసుపత్రిలో వైద్య సేవలు అందించనున్నారు. ఈ ఆసుపత్రిలో అత్యాధునిక టెక్నాలజీ ఏఐతో కూడిన రోగ నిర్ధారణలు, రోబోటిక్ సర్జరీలు ,అడ్వాన్స్డ్ హోల్ బాడీ ఎం ఆర్ ఐ, జాయింట్ రీ ప్లేస్ మెంట్ సర్జరీలు, లేజర్ సర్జరీలు, హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు, అత్యాధునిక ఐ సి యూ వంటి సదుపాయాలు వున్నాయి.

## బాపట్ల వసతి గృహాల్లో నెట్ జీరో విప్లవం

*- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్*

*- ఈ నెల 5న పెద్ద ఎత్తున మొక్కల నాటడానికి గుంతల తవ్వకం*

*- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు*



బాపట్ల, జూన్ 3. ప్రభాతవార్త ప్రతినిధి:జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను పర్యావరణహితంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ‘నెట్ జీరో హెల్తీ క్యాంపస్’ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ వెల్లడించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఈ కార్యక్రమానికి సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. డ్వామా పిడి, డిఆర్డిఎ పీఓ, స్థానిక మునిసిపల్ కమిషనర్లు, జెడ్పీ సీఈఓ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, నెడ్క్యాప్ పీఓ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను కర్బన ఉద్గార రహిత (నెట్ జీరో) ప్రాంగణాలుగా మార్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఏడు ప్రధాన అంశాలతో కూడిన కార్యాచరణను అమలు చేయాలన్నారు. జూన్ 5న బృహత్ కార్యక్రమం..ఈ నెల 5వ తేదీ జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో మొక్కలు నాటడానికి పెద్ద ఎత్తున గుంతలు తీసే కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి హాస్టల్లో స్థలాన్ని కేటాయించాలన్నారు. ఈ పనులకు సంబంధించిన డేటాను ఎంపీడీఓలు, ఏపీఓలు వెంటనే ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు, స్వచ్ఛంద సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలన్నారు. ఏడు సూత్రాల ప్రణాళిక ఇదే..వసతి గృహాల రూపురేఖలు మార్చేందుకు ఏడు అంశాల విధానాన్ని కలెక్టర్ వివరించారు. పచ్చదనం: ప్రాంగణాల్లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం. సౌర విద్యుత్: ప్రతి వసతి గృహంలో సోలార్ రూఫ్టాప్ ప్యానెళ్ల ఏర్పాటు, డిస్కామ్ల ద్వారా నెట్ మీటరింగ్ సౌకర్యం కల్పించి విద్యుత్ వినియోగాన్ని సున్నా స్థాయికి తీసుకురావడం. ఘన వ్యర్థాల నిర్వహణ: కంపోస్ట్ తయారీ యూనిట్ల ఏర్పాటు. కిచెన్ గార్డెన్: వసతి గృహ అవసరాల కోసం అంతర్గతంగా కూరగాయల తోటల పెంపకం. మురుగునీటి శుద్ధి: రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా మురుగునీటిని మొక్కలకు మళ్లించాలన్నారు.వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని అయినా తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత: విద్యార్థుల్లో పరిశుభ్రత పెంపొందించేలా ప్రత్యేకంగా ‘ముస్తాబు’ కార్యక్రమం అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, బీసీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు

## సజావుగా ఏపి పీసెట్ పరీక్షలు ప్రారంభం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్3, ప్రభాతవార్త: ఏఎన్యులో ఏపి పీసెట్ పరీక్షలు బుధవారం సజావుగా ప్రారంభమయ్యాయి. వీసి ఆచార్య కె.గంగాధరరావు పీసెట్ పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసి పీసెట్లో అభ్యర్థులకు ఏర్పాట్లపై కన్వీనర్ ఆచార్య పాల్కుమార్ను అభినందించారు. పాల్కుమార్ మాట్లాడుతూ తొలిరోజు పీసెట్కు 715మంది అభ్యర్థులకు పరీక్షలు ఆహ్వానించగా 491మంది హాజరయ్యారన్నారు. అభ్యర్థులకు లాంగ్జంప్, హైజంప్, షాట్పుట్, 100, 800 మీటర్ల పరుగులో పరీక్షలు నిర్వహించారు. గురువారం హాల్టికెట్ నెంబరు 10716 నుంచి 11430 వరకు 714 మందికి పరీక్షలు జరుగుతాయన్నారు.

## సర్కు సహకరించండి

## : రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, జూన్ 3 (ప్రభాతవార్త): భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు పటిష్ట కార్యాచరణతో నిర్వహిస్తున్నామని ఈ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో



కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, బీఎల్వో సూపర్వైజర్లకు శిక్షణతో పాటు సన్నద్ధత కార్యకలాపాలు ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పోలింగ్ బూత్ స్థాయి బీఎల్వోలకు అందజేసి ఈ నెల 15వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు సమాచారాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, ఆ తర్వాత వీటిని పరిష్కరించి ఈ ఏడాది సెప్టెంబర్ 22న తుది జాబితాను ప్రచురిస్తారని వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ)ను నియమించుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకర ఓటర్ల జాబితా కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితా లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జరుగుతున్న కృషికి రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,792 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా 129 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీహెచ్ చిట్టిబాబు (తెదేపా), తరుణ్ కాకాని (భాజపా), జె.శ్రీనివాస్ (జనసేన), యార్లగడ్డ ఆంజనేయ రెడ్డి (వైఎస్ఆర్సీపీ), కె.పరమేశ్వరరావు (ఏపీ), రాంమోహన్రావు, టి.వెంకటేశ్వరరావు (బీఎస్పీ), డీవీ కృష్ణ (సీపీఐఎం), కలెక్టరేట్ సమన్వయం విభాగం అధికారి అనుష్ కుమార్, ఎన్నికల డీటీ గోపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

**--మెంబర్స్ డైరెక్టరీని ఆవిష్కరించిన మంత్రి భరత్**



గుంటూరు కల్చరల్, జూన్ 3, ప్రభాతవార్త : రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు కూటమి సర్కార్ ప్రోత్సాహకాలనందిస్తూ అండగా నిలుస్తుందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. నవ్యాంధ్ర ప్లాస్టిక్ మ్యాన్ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం బుధవారం మంత్రి భరత్ను మర్యాదపూర్వ కంగా కలిసారు.అనంతరం అసోసియేషన్ మెంబర్స్ డైరక్టరీని మంత్రి ఆవిష్కరించారు.తొలుత అసోసియేషన్ సభ్యులు తమ ప్లాస్టిక్ పరిశ్రమ ఎదుర్కొం టున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీస్కెళ్ళారు.అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలపరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీఇచ్చారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.జయకుమార్, ఉపాధ్యక్షుడు డి.కృష్ణారావు,కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు,కోశాధికారి వై.బి.రెడ్డి,సంయుక్త కార్యదర్శి వి.ఎస్.ఆర్.ప్రసాద్,డైరీచైర్మన్ జి.శ్యామ్కుమార్,సభ్యులు పాల్గొన్నారు.

ong-55_ong-55.qxd 6/4/2026 1:41 AM Page 1



## పి.ఎ.ఎస్ కళాశాలను సందర్శించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎఫ్.ఎఫ్.సి ఇన్స్పెక్షన్ కమిటీ



పెదనందిపాడు జూన్ 3 (ప్రభాతవార్త) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అఫ్లియేషన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ జి నాగరాజు . అండ్ మెంబర్ ప్రొఫెసర్ కె. సోమ శేఖర్ బుధవారం పెదనందిపాడు ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలను పరిశీలించి ఇన్స్పెక్షన్ చేశారు. ఈ సందర్భంగా వారు కళాశాలలోని వసతులు, లైబ్రరీ, లాబ్స్, క్లాస్ రూమ్స్, ప్లే గ్రౌండ్ పరిశీలించినారు. 2026 27 విద్యా సంవత్సరానికి యూనివర్సిటీ అఫ్లియేషన్ కొరకు వారు కళాశాలను సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ జి వీర రాఘవయ్య వైస్ ప్రిన్సిపాల్ కే ప్రతాప్ కుమార్ లు వారికి కావలసిన సమాచారాన్ని అందజేయడం జరిగినది.

## పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ అభివృద్ధికి రూ. 5 లక్షల విరాళం అందించిన బయోఫోర్ ఫౌండేషన్



పెదనందిపాడు జూన్ 3 (ప్రభాతవార్త)గుంటూరు జిల్లా పెదనందిపాడులోని గ్రామీణ వాతావరణంలో 1968లో స్థాపించబడిన ప్రతిష్ఠాత్మక. పెదనందిపాడు కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ సైన్సెస్ (పి.ఎ.ఎస్ కళాశాల). మరియు 2011లో స్థాపించబడిన నంది పాఠశాలలను నిర్వహిస్తున్న పి.ఈ.డి సొసైటీకి, హైదరాబాద్ కేంద్రంగా స్థాపించబడిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బయోఫోర్ ఇండియా ఫార్మస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరొకసారి అభివృద్ధికి చేయూతనందించింది. పి.ఈ.డి సొసైటీ పాలకవర్గ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ గారితో గల సుదీర్ఘ పరిచయ స్నేహ సంబంధాల నేపథ్యంలో, బయోఫోర్ ఇండియా ఫార్మస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన బయోఫోర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు సీ.ఈ.వో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామ వాస్తవ్యులు డాక్టర్. రంగిశెట్టి జగదీష్ బాబు , సహ వ్యవస్థాపకులు మరియు సి.ఎస్.ఓ డాక్టర్. పుల్లగూర్ల మాణిక్ రెడ్డి పెదనందిపాడు విద్య సంస్థ యొక్క విద్యాప్రమాణాలను ప్రశంసిస్తూ, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలకు అండగా రూ. 5,00,000 (ఐదు లక్షలు) విరాళంగా అందించారు. ఈ మొత్తం నేరుగా పి.ఈ.డి సొసైటీ అకౌంట్‌లో జమ చేయబడింది. ఇది కేవలం ఒక్కటే విరాళం కాదు గత కొన్ని సంవత్సరాలుగా బయోఫోర్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం పి.ఈ.డి సొసైటీకి ఆర్థిక సహాయం అందిస్తూ విద్యాభివృద్ధిలో భాగస్వామిగా నిలుస్తోంది. ఇప్పటివరకు వారు సొసైటీకి మొత్తం రూ. 12 లక్షలు విరాళంగా అందించారు. తెలుగు రాష్ట్రాలలో బయోఫోర్ విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి విశేషంగా కృషి చేస్తున్నారు. అలాగే బయోఫోర్ ఫౌండేషన్ తరుపున కోవిడ్ సమయంలో కళాశాల మరియు నంది పాఠశాల లోని విద్యార్థులకు మరియు అధ్యాపకులకు ఉచిత వైద్య సహాయం, మెడిసిన్, మరియు కోవిడ్ కిట్లు అందించి మానవతా సేవలో ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా, పి.ఈ.డి సొసైటీ అధ్యక్షులు, విశ్రాంత విజిలెన్స్ ఏ ఎస్ పి.కాళహస్తి సత్యనారాయణ. కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్. విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్.లావు రత్తయ్య పాలకవర్గం తరపున బయోఫోర్ ఫౌండేషన్ యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినారు. పి.ఈ.డి సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ"బయోఫోర్ ఫౌండేషన్ వంటి సంస్థలు విద్యా రంగానికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయని, వారి నిరంతర సహకారంతో మా సంస్థలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టగలుగుతున్నాము అని తెలిపారు. అంతేగాక, బయోఫోర్ ఫౌండేషన్ రాబోయే రోజుల్లో మరిన్ని నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, మరియు సామాజిక సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి మరింతగా పాటుపడాలని ఆకాంక్షి ంచినారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య. వైస్ ప్రిన్సిపాల్ కె ప్రతాప్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులతో భూములు భూసారాన్ని కోల్పోతాయి..

వట్టిచెరుకూరు, జూన్ 3, ప్రభాతవార్త : రైతులు తమ భూముల్లో రసాయన ఎరువులను విచక్షణ రహితంగా వినియోగించడం వల్ల భూములు సారవంతతను కోల్పోయి, నిస్సారంగా మారుతాయని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు రూరల్



మండలం, లాల్పురం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మ పిడి వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ..నేల ఒక సజీవ పర్యావరణ వ్యవస్థ అని,అది రైతుకు అత్యంత విలువైన ఆస్తి అన్నారు. రైతు ఉత్పాదకత నేరుగా నేల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని, రైతులు తమ భూములను తామే సంరక్షి ంచుకొని భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. భూసారాన్ని పునరుద్ధరించేందుకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట పంటలు, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలని తెలియజేశారు. అలాగే రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీ, అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, పీఎస్బీ, కేఆర్బీ వంటి బయో ఫెర్టిలైజర్లను వినియోగించాలని రైతులకు సూచించారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని తెలిపారు. ప్రధాన పోషకాలతో పాటు కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, జింక్, బోరాన్, ఐరన్ వంటి సూ పోషకాలను కూడా పంటలకు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

ఏడిఏ ఎన్.మోహనరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా పంటల వారీగా, విస్తీర్ణం ఆధారంగా విడతల వారీగా ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు కూడా ఎరువులు అందజేస్తామని, ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. రైతులందరూ ఫార్మర్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ మాట్లాడుతూ..పీఎంకిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న ప్రతిరైతు జూన్ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. సొంత భూములు కలిగిన రైతులందరూ వ్యవసాయ శాఖ ద్వారా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకొని 11అంకెల ఫార్మర్ ఐడీని పొందాలని కోరారు. కౌలు సాగు చేస్తున్న ప్రతిరైతు తప్పనిసరిగా కౌలురైతు గుర్తింపుకార్డు పొందాలని, అందుకు అవసరమైన పత్రాలతో తమ గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని తెలిపారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకూ సీసీఆర్సీ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. సబ్సిడీపై అందజేస్తున్న పథకాల వివరాలను రైతులకు తెలియజేశారు. మండలం మాజీ ఎంపీపీ తోట లక్ష్మీ ్మకుమారి మాట్లాడుతూ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం కోసం ఉన్నతాధికారులు లాలుపురం గ్రామానికి రావడం ఆనందదాయకమన్నారు. అధికారులు సూచించిన వ్యవసాయ పద్ధతులను రైతులు పాటించి నేలను పరిరక్షి ంచుకోవడం ద్వారా ప్రజారోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు మరియు పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్ఏ అర్చన, ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ విజయవంతం చేయండి:

### వైసీపీ ఇంచార్జి వేమారెడ్డి పిలుపు



దుగ్గిరాల జూన్3(ప్రభాతవార్త): వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు,జూన్ 4వ తేదీన మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా "వెన్నుపోటు దినం" నిరసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు.జూన్ 4 గురువారం దుగ్గిరాల శివాలయం గుడి వద్ద నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడుతుందని, దుగ్గిరాల మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన శివ గోపయ్య సమక్షంలో ఈ నిరసన ప్రదర్శనలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ ఇంచార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు పాల్గొంటారని తెలిపారు. కావున దుగ్గిరాల మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ కమిటీల అధ్యక్షులు, జిల్లా స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్, మహిళలు మరియు వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు నిరసనగా చేపట్టే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలని,దుగ్గిరాల మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన శివ గోపయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆక్వా రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహనకృష్ణ



నిజాంపట్నం, జూన్ 3, ప్రభాతవార్తః రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులను పట్టించుకోవటంలేదని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహనకృష్ణ విమర్శించారు. బుధవారం మండలంలోని కొత్తపాలెం పరిసర ప్రాంతాలలో రొయ్యల చెరువులను ఆయన పరిశీలించారు. అనంతరం రొయ్యలు సాగు చేస్తున్న రైతులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా రంగం పట్ల ప్రభుత్వం ఉదాసీనవైఖరి అవలంభిస్తున్నదన్నారు. విద్యుత్ సబ్సీడీ నిలిపివేయటంతో రైతులపై భారం పడిందన్నారు. రాత్రి సమయాలలో విద్యుత్ సరఫరాకు కోతలు వేయటంతో ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. రొయ్యల మేత ధరలు పెరిగాయని, గిట్టుబాటు ధరలేదన్నారు. వైకాపా ప్రభుత్వం యూనిట్‌కు రూ.2లు సబ్సీడీ అందించిందన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఉద్యమిస్తామనా న్నరు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం మాజీ సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, గ్రామపార్టీ అధ్యక్షుడు చిప్పల రామారావు, రాష్ట్ర కార్యదర్శి మదన్‌మోహన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలాజీ, రేపల్లె పట్టణకన్వీనర్ శేషగిరిరావు, రేపల్లె రూరల్ మండలకన్వీనర్ అనిల్, ఆక్వా రైతులు పాల్గొన్నారు. తదనంతరం ఇటీవల మృతిచెందిన వైకాపా కార్యకర్త కొక్కిలిగడ్డ వీరాంజనేయులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

## పరిశోధనలో జయదేవ్‌కు డాక్టరేట్



రేపల్లె, జూన్ 3, ప్రభాతవార్త:ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యయన కేంద్రంలో పరిశోధనలు నిర్వహించిన రేపల్లె పట్టణానికి చెందిన వడ్డే జయదేవ్‌కు పిహెచ్‌డి పట్టా లభించింది.జయదేవ్‌కు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరిశోధన విభాగం కో ఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ బుధవారం వెల్లడించారు."ఆధునిక భారతదేశ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాత్ర" అనే అంశంపై జయదేవ్ పరిశోధన పూర్తి చేశారు.పర్యవేక్షకునిగా ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ వ్యవహరించారు.బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వడ్డే ఆశీర్వాదం,సుమతి దంపతుల రెండో సంతానమైన డాక్టర్ వడ్డే జయదేవ్ ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజరుగా విధులను నిర్వహిస్తున్నారు.పిహెచ్‌డి పూర్తిచేసిన డాక్టర్ వడ్డే జయదేవ్‌ను అంబేద్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వై.అశోక్‌కుమార్,విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు,అధ్యాపకులు,పరిశోధకులు,రేపల్లె ఎస్సీ ఎస్టీబిసిమైనార్టీ అధ్యక్షుడు డి.సాంబశివరావు,రేపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వాగోలు బాబూరావు,రేపల్లె మిషన్ కాంపౌండ్ యూత్ నాయకులు సముద్రాల ప్రభుకిరణ్ తదితరులు అభినందించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలి

నిజాంపట్నం, జూన్ 3, ప్రభాతవార్తః అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలని తెదెపా మండల పార్టీ అధ్యక్షుడు దండుప్రోలు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపాలెంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అవగాహన కలి ్పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ సిబ్బంది వచ్చినపుడు వారు అడిగిన వివరాలు తెలియజేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలన్నారు.

## ప్రజలను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం



రేపల్లె, జూన్ 3, ప్రభాతవార్త:అబద్ధపు,మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్ఆర్ కా ంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త పీటా నాగ మోహన్ కృష్ణ విమర్శించారు. బుధ వారం వెన్నుపోటుకు రెండేళ్ళు కార్యక్రమంలో భాగంగా పోస్టర్,పుస్తకాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిపాలనపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్నదని చెప్పారు.వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ పట్ల ప్రజాదరణ పెరుగుతున్నదని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వైకాపా రేపల్లె పట్టణ కన్వీనర్ కె.శేషగిరిరావు,రేపల్లె,నగరం,చెరుకుపల్లి మండలాల కన్వీనర్లు ఎం.అనిల్,ఐ.రామకృష్ణ, డి.వెంకటరామిరెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వై.మదన్ మోహన్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు చిత్రాల ఒబేదు,చిమటా బాలాజీ,జిల్లా అధికార ప్రతినిధి కె.వెంకటకృష్ణారెడ్డి, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు ప్రభు కిరణ్,రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి నీలం వీరేంద్ర,నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు డి.కొండల రెడ్డి,చేనేత విభాగం కార్యదర్శి పి.శ్రీనివాసరావు,నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి,కుద్దూస్,ఖాదర్,గౌస్,ప్రసన్న తేజ,రవికుమార్, నాగేశ్వరరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి వైకాపా పరామర్శ



రేపల్లె, జూన్ 3, ప్రభాతవార్త:వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బేతపూడి కోటేశ్వరరావు బంధువు సాయి ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఆ కుటుంబాన్ని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగ మోహన్ కృష్ణ పరామర్శించి సానుభూతి తెలిపారు.సాయి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైకాపా శ్రేణులు కరేటి శేషగిరిరావు,మేడికొండ అనిల్, వై.మదన్ మోహన్, చిమటా బాలాజీ,వెంకట కృష్ణారెడ్డి, పి.శ్రీనివాసరావు, ఫణి, గోపి, శివ,రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం అభివృద్ధి పనుల పరిశీలన



రేపల్లె, జూన్ 3, ప్రభాతవార్త:ఇసుకపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి దేవాలయంలో రూ.40 లక్షల సిజిఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ బుధవారం పరిశీలించారు.90 రోజుల వ్యవధిలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.ఈ నెల 27వ తేదీ నుండి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణాధికారి దీవి వెంకటప్పలాచార్యులు,కొమ్మూరు పవన్ కుమార్,శర్మ,టి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## నగరం నూతన ఎస్సై చెన్నకేశవులు



నగరం, జూన్ 3 ,ప్రభాతవార్త: నగరం నూతన ఎస్సై డి.చెన్నకేశవులు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నగరం వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో పనిచేసిన బండ్ల భార్గవ్ వి ఆర్ కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. అనంతరం నగరం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ వసతిగృహాల్లో దోమలమందు పిచికారీ:



తెనాలి మున్సిపాలిటీ జూన్3(ప్రభాతవార్త): గుంటూరు జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆదేశాల ప్రకార్ర,మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణం లోని వివిధ ప్రభుత్వ వసతి గృహాలలో దోమల నివారణకై ముందు జాగ్రత్త చర్యగా ఆల్ఫా సైపర్ మిత్రిన్ మందును పిచికారీ చేయించడం జరిగిందని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్ (యుయల్ బి)ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మోళి తెలిపారు. ప్రస్తుతము ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సెలవులు కావున ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే లోపల ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయవలెనన్న ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత హాస్టల్ లో వార్డెన్లు మలేరియా పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు దాసరి శివనాగమల్లేశ్వరరావు ఆరోగ్య కార్యకర్తలు ఆలా వేణుగోపాల్ ,షేక్ నవీద్ సంకశరత్ బాబు, దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సహకరించిన వసతి గృహాల వార్డెన్లకు మలేరియా శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థుల నమోదు శాతం పెంచాలి



కర్లపాలెం. జూన్03. ప్రభాతవార్త:విద్యార్థుల నమోదు శాతం పెంచాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష జి సి డి ఓ చారులత అన్నారు. బుధవారం కర్లపాలెం మండలం చింతయపాలెం ఉన్నత పాఠశాలలో పాఠశాలల సముదాయం సమావేశం జరిగింది. ఈ సమావేశంకి కర్లపాలెం మండల విద్యాశాఖ అధికారులు టి యు మనోరంజని, ఎన్ విజయ శ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కర్లపాలెం మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ అందరూ ఉపాధ్యాయులు ఎన్రోల్మెంట్లో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి విజయశ్రీ. వేణుమాధవ్, విజయ భాస్కర్ రెడ్డి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## బాపట్ల మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా చంద్రమోహన్

### కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్



బాపట్ల, జూన్ 3: ప్రభాతవార్త ప్రతినిధి:బాపట్ల పురపాలక సంఘ నూతన ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా ఎం. చంద్రమోహన్ బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన రఘునాథరెడ్డి స్థానంలో, అదే కార్యాలయంలో మేనేజర్‌గా విధుల్లో ఉన్న చంద్రమోహన్‌ను ప్రభుత్వం ఈ బాధ్యతలకు పురమాయించింది. ఈ నేపథ్యంలో నూతన ఇన్‌ఛార్జ్ కమిషనర్ చంద్రమోహన్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు, మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సాయి ప్రసాద్, సీఈఓ వివేక్ యాదవ్

బాపట్ల, జూన్ 3. ప్రభాతవార్త ప్రతినిధి:ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్2026) కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయం నుండి ఓటరు జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్ లోని మినీ



వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అదే సమయంలో మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు మరియు అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకు తావులేకుండా నాణ్యతతో కూడిన సవరణలు జరగాలన్నారు.

**ఇంటింటి సర్వే పగడ్బందీగా ఉండన్న కలెక్టర్**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో సర్ 2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అత్యంత పకడ్బందీగా అమలు చేస్తున్నామని వివరించారు. నిర్దేశిత గడువులోగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నారని.. డూప్లికేట్ ఓట్ల గుర్తింపు, చిరునామా మార్పులు, చేర్పులు, మరణించిన వారి వివరాల సేకరిస్తున్నారని చెప్పారు. విస్తృత తనిఖీల ద్వారా ఓటరు జాబితా నాణ్యతను మరింత మెరుగుపరుస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎన్నికల పర్యవేక్షకులు షఫి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపై వైసీపీ నిరసన కార్యక్రమాలు

### వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల



మంగళగిరి, జూన్ 3, ప్రభాతవార్త:కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దొంతి రెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినంపేరిట వారం రోజుల నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. పెన్షన్ 4,000 పెంచుతామని చెప్పి, 60 లక్షల మంది లబ్ధిదారుల్లో 6.2 లక్షల మందికి పెన్షన్ కోత విధించారు. 1845 ఏళ్ల మహిళలకు నెలకు 1,500 చొప్పున ఏడాదికి 18,000 ఇస్తామన్నారు. రెండేళ్లకు ఒక్కొక్కరికి 36,000 బకాయి ఉందన్నారు. నిరుద్యోగ భృతి నెలకు 3,000 చొప్పున రెండేళ్లకు ఒక్కొక్క నిరుద్యోగికి 72,000 కావాలన్నారు.ఉచిత బస్సు ప్రయాణం 1516 సర్వీసులకు బదులు కేవలం 5 సర్వీసులకే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి, మిగతా 10 సర్వీసులను విస్మరించారన్నారు. ఈనెల 4వ తేదీ మంగళగిరినియోజకవర్గంలోని మండలమైన దుగ్గిరాల కేంద్రంలో ఉదయం 10 గంటలకు ర్యాలీ, 9వ తేదీ మంగళగిరి టౌన్‌లో పరిధిలో టౌన్ హాల్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు, తదితరులు హాజరుకానున్నారు. 12వ తేదీ మంగళగిరి టౌన్‌లో నియోజకవర్గ స్థాయి నిరసన ర్యాలీ. ఇదే రోజు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు జరుగుతాయి. చంద్రబాబు ప్రభుత్వం హామీల అమలులో విఫలమై ప్రజలకు వెన్నుపోటు పొడిచిందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ పోస్టర్‌ను రూపొందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల అధ్యక్షులు అమర నాగయ్య, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివ గోపయ్య తదితరు లు పాల్గొన్నారు.

## జనగణనలో బాధ్యతగా వ్యవహరించండి

### కేడర్‌కు దిశానిర్దేశం చేసిన ఎంఎల్సి ఆలపాటి



తెనాలి జూన్3(ప్రభాతవార్త): జూన్ 14వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఎస్ఐఆర్ సమగ్ర జనాభా పరిశోధన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని, తెనాలి నియోజకవర్గ తెలుగు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని ఎన్విఆర్ ఫంక్షన్ హాల్ నందు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జి, బూత్ కన్వీనర్లు మరియు ముఖ్య నాయకులతో, ఓటర్ నమోదు ప్రక్రియ, నూతన ఓటర్ నమోదు, మరణించిన వారి ఓటు తొలగింపు, అడ్రెస్స్ మారిన వారి ఓటును గమనించటం పై కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, ఇంటింటికి నిర్వహించే జనగణన కార్యక్రమంలో ప్రతి ఓటరును కలిసి సమగ్ర సమాచారం సేకరించాలని, ఎవరైనా మరణించిన వారి ఓట్లను తొలగించడం అలాగే నూతన ఓటర్లను చేర్పించటం అదేవిధంగా ఇల్లు మారిన వారి ఓట్లు, మార్పులు చేర్పులు లాంటి కార్యక్రమాల్లో పార్టీ క్యాడర్ బాధ్యతగా వ్యవహరించాలని,అలసత్వం వహించకుండా మరింత జాగ్రత్త పాటించాలన్నారు. బూత్ లెవెల్ కన్వీనర్లు అలాగే యూనిట్ ఇన్చార్జిలు క్లస్టర్ ఇంచార్జిలు అందరూ సహకరించుకుంటూ టీం వర్క్ లాగా ప్రతిరోజు 50 మంది ఓటర్లను కలిసే విధంగా కార్యక్రమాలను రూపొందించుకోవాలని, ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు,అవకతవకలు లాంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి,అలాంటి ఓటరులను రద్దు చేయించాలని ఈ విషయంలో పార్టీ అండగా ఉంటుందన్నారు.2002 సంవత్సరములో సమగ్ర ఓటరు జన గణన నిర్వహించారని,మరలా 22 సంవత్సరాల తరువాత ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్సీ ఆలపాటి తెలిపారు. తెలుగుదేశం పార్టీకి చెందిన బూత్ ఇన్చార్జులు,బిఎల్ఓ లతో సమన్వయం చేసుకుంటూ నిజమైన ఓటర్లను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎండి.ఖుద్దుస్,పార్టీ సీనియర్ నాయకులు ఈదర పూర్ణచంద్,వేమూరి శేషగిరిరావు,పెండేల వెంకట్రావు,అన్నం పిన్నారావు,పసుపులేటి త్రిమూర్తి,కొల్లిపర మండల నాయకులు వంగా సాంబిరెడ్డి, భీమవరపు కోటిరెడ్డి, మహిళా నేతలు పరుచూరి రమ్య, గుమ్మడి భావన, సయ్యద్ షావుల్,ఉలసి పూర్ణ,కే.యోగేష్,పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

6MN 8_6MN 8.qxd 6/4/2026 1:41 AM Page 1



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి డాక్యుమెంట్‌కు,05 ఇనామ్ అన్సైడ్ భూములకు రిజిస్ట్రేషన్లు.

### రోజువారి స్లాట్ బుకింగ్ 38..

### సేల్ డిడి, గిఫ్ట్ డిడిలలో 0.05 ఇవ్వాల్సిందే..!

అమరావతి, ప్రభాతవార్త: సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతుంది. 0.05 లేనిదే ఏ డాక్యుమెంటు ముందుకు కదలదు. స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకి 38 వరకు ఆన్లైన్ దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. 10 లక్షలు వాల్యుయేషన్ ఉన్న భూమికి ప్రభుత్వానికి 10000 ఢీడీ కట్టాలి. 5000 సబ్ రిజిస్టర్ కి సమర్పించాలి. ఏవైనా లిటిగేషన్ ఉంటే 20,000 వరకు గుంజుతున్నారని ఆరోపణలు అమరావతి సబ్ రిజిస్టర్ మీద వెలువెత్తుతున్నాయి. రిజిస్ట్రార్ వచ్చి రెండు సంవత్సరాల కాల పరిమితిలో సుమారు 22 వందల సేల్ డీడీలు, గిఫ్ట్ డిడిలో వివిధ రిజిస్ట్రేషన్ లో జరిగాయి. పరిసర ప్రాంతాల్లోని వాల్యుయేషన్ బట్టి ప్రభుత్వ ధారావతు సొమ్ము డిడి రూపంలో చెల్లించాలి. డాక్యుమెంట్ రైటర్ల అండదండలతో, కార్యాలయంలో ప్రవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని, తన అవినీతి సామ్రాజ్యానికి తెర లేపారు సబ్ రిజిస్టర్. ఉన్నతాధికారులు తూతురు మంత్రంగా తనిఖీలు చేసి వెళ్లడం వచ్చినవారికి "మామఖి అనిపించడంతో వారి ఆటలు ఆడిందే ఆటగా సాగుతున్నాయి. విజిలెన్స్ అధికారులు ఏసీబీ అధికారులు అమరావతి వైపు కన్నెత్తి చూడలేదు. పోయేది ప్రజల సొమ్మే కాబట్టి వారి జీతాలు ఇంట్లో ఉన్న వస్తాయి. అవినీతి అధికారుల పనితీరు తెలిసినప్పటికీ, కన్నెత్తి చూడని వైనం. గత నాలుగు ఐదు నెలలుగా ఇనాం భూములు ఆన్ సైడ్ భూములు ఆన్లైన్లో చేస్తూ, సబ్ రిజిస్టర్ అక్రమార్జన అధికంగా పెంచుకున్నారని ఆరోపణలు అమరావతిలో వినిపిస్తున్నాయి. రిటైర్మెంట్ కు దగ్గరలో ఉండడంతో అందిన కాడికి లాక్కునే పనిలోనే ఉన్నారని, పలువురు విమర్శిస్తున్నారు. రెండు సంవత్సరాల్లో 20 నుంచి 30 లక్షల వరకు సబ్ రిజిస్టర్ 0.05 ద్వారా సంపాదించారనే ఆరోపణలు వెల్లువెత్తుకున్నాయి. కార్యాలయంలో సబ్ రిజిస్టర్ తో పాటు ఓ ప్రైవేటు వ్యక్తి చక్రం తిప్పుతున్నారు.సీనియర్ అసిస్టెంట్, సబ్ రిజిస్టర్ కు వాటాల వద్ద కొంత విభేదాలు వచ్చాయని వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు అమరావతి సబ్ రిజిస్టర్ కార్యాలయం పై ప్రత్యేక నిదాన ఏర్పాటు చేసి డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అందించే 0.05 అక్రమ వాసులను అరికట్టాలని స్థానిక ప్రజలు రిజిస్ట్రేషన్ దారులు కోరుతున్నారు

## డి ఏ ఓ వచ్చారు వెళ్లారు...

అమరావతి, ప్రభాతవార్త: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందాలంటే లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్స్ వద్ద నాణ్యమైన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. సీజన్ ప్రారంభంలోనే వ్యవసాయ అధికారులు ప్రతి బ్రాండ్ ను తనిఖీ చేసి, బిల్లులు లేని వాటిని పరిశీలించి, అనుమతులు లేని వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. పల్నాడు జిల్లా డీఏ వో బుధవారం అమరావతి మండలంలో తూ,తూ మంత్రంగా తనిఖీలు చేపట్టారని రైతులు ఆరోపించారు. వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, గ్రోమోర్ లాంటి రెండు మూడు షాపులను తనిఖీ చేసి ఒక్క నిమిషంలోనే కనిపించి, వచ్చారు వెళ్లారు అన్న రీతిలో తమ విధులు నిర్వర్తిస్తున్నారని రైతులు తెలిపారు. షాపు యాజమాన్యాలు ఇచ్చే ముడుపుల కోసం దేశానికి అన్నం పెట్టి రైతులకు నాణ్యమైన ఎరువులు, అందకపోగా నకిలీలకు, కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అమరావతి ఏవో, ఒక షాపు లైసెన్సు రెన్యువల్ చేయాలంటే 20,000 తీసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి కొనుగోలుకు బిల్లు ఇవ్వవలసి ఉండగా రైతులకు బిల్లు ఇవ్వడం లేదు. ప్రతి బ్రాండ్ కు అనుమతి తప్పనిసరి, కానీ ఫర్టిలైజర్స్ ఎక్కువ లాభాలను అర్జించేందుకు, వ్యవసాయ అధికారులతో కుమ్మక్కై, అనుమతి లేని బ్రాండ్లను రైతులకు అంటగడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అధికారి తనిఖీ నిమిత్తం హాజరు వేయించుకుని వెళ్ళినట్టే, మండల వ్యవసాయ అధికారులు, అనుమతి లేని గూడాలు, నిరోధించిన బయో ఉత్పత్తులకు కొమ్ముకాస్తూ షాపు యాజమాన్యాలతో కుమ్మక్కై, రైతులను మోసం చేస్తున్న వైనం మండలంలో నెలకొంది. ప్రతి విత్తనం బ్రాండ్ ను పరిశీలించాలి. ప్రతి బిల్లును క్షుణ్ణంగా చూడాలి. ప్రతి గూడెం లో ఉన్న స్టాక్ ను రికార్డు ప్రకారం పరిశీలిస్తూ, ఎక్స్పైర్ డేట్ ను పరిశీలించాలి. అనుమతులు లేని అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుతాయి. దిగుబడులు విస్తారంగా కాశి లాభాల బాటలో పయనిస్తారు. విజిలెన్స్ అధికారులు అమరావతి మండలంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అనుమతులేని ఎరువుల గూడెలను, బయో ఉత్పత్తి మందులను, నకిలీ విత్తనాలను గుర్తించాలని స్థానిక రైతుల కోరారు.

## సిఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నగర మాజీ డిప్యూటీ మేయర్ షేక్. సజీల



గుంటూరు కార్పొరేషన్, జూన్ 3 (ప్రభాత వార్త ) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక ప్రైవేట్ కార్యక్రమానికి గుంటూరు నగరానికి వచ్చిన సందర్భంలో గుంటూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ షేక్. సజీల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సీఎం చంద్రబాబుకు పూల మొక్క ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

## నగర కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ కి డి.పి.ఆర్ తయారు చేయాలి

- 24గంటల తాగునీటి సరఫరా పై దృష్టి సారించాలి
- 8 జంక్షన్ లు ఆధునీకరణకు చర్యలు
- జిల్లా కలెక్టర్, గుంటూరు నగర కార్పొరేషన్ ప్రత్యేక అధికారి సి.యం.సాయి కాంత్ వర్మ



గుంటూరు కార్పొరేషన్ , జూన్ 3 ( ప్రభాత వార్త ): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను(యు.జి.డి) పక్కాగా ఏర్పాటు చేయుటకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డి.పి.ఆర్) తయారు చేయాలని జిల్లా కలెక్టర్, గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి సి.యం.సాయి కాంత్ వర్మ జిఎంసి అధికారులను ఆదేశించారు. గుంటూరు పట్టణంలో యు.జి.డి, నిరంతర నీటి సరఫరా, సుందరమైన కూడళ్లు, పార్క్ ఏర్పాటు, పి.వి.కే నాయుడు మార్కెట్ పునర్నిర్మాణ పనులుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిఎంసి అధికారులతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణానికి యు.జి.డి వ్యవస్థ పక్కాగా ఉండాలన్నారు. ఇప్పటికే పూర్తి అయిన భాగంతో పాటు ఇంకా పూర్తి చేయాల్సి న భాగంపై స్పష్టమైన విశ్లేషణ చేసి డి.పి.ఆర్ లు తయారు చేయాలని సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలో జోన్ల వారీగా ఎస్.టి.పి (సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) లను ఏర్పాటును కూడా ఇందులో చేర్చాలని అన్నారు. పి.వి.కే నాయుడు మార్కెట్ పునర్నిర్మాణ పనుల లాభదాయకతపై స్పష్టమైన విశ్లేషణ చేయాలని ఆదేశించారు.

నిరంతర నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించాలి. గుంటూరు పట్టణంలో ఉన్న అన్ని గృహాలకు నిరంతర నీటి సరఫరా అవకాశాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. నీటి సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, ఎక్కడా అతిసార వ్యాధి వంటి అంశాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

8 జంక్షన్‌లు ఆధునీకరణ..

పట్టణంలో 8 జంక్షన్ లు ఆధునీకరణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన మోడల్ లను పరిశీలించారు. హిందూ కాలేజీ కూడలి, బి.ఆర్ నాయుడు మార్కెట్ కూడలి, జిన్నా టవర్ జంక్షన్, కలెక్టర్ కార్యాలయం కూడలి, మూడు బొమ్మల జంక్షన్, చుట్టుగుంట జంక్షన్, మెడికల్ క్లబ్ జంక్షన్ ల సుందరీకరణకు అవసరమగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఏ.పి.యు.ఐ.ఏ.ఎం.ఎల్ ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దళితులకు రాజ్యాధికారంతోనే రక్షణా విముక్తి

### దళిత బహుజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు

### గుంటూరు విద్య జూన్ 3 ప్రభాతవార్త



గుంటూరు కార్పొరేషన్ , జూన్ 3 ( ప్రభాత వార్త ): దళితులకు రాజ్యాధికారం సాధన ద్వారా నే రక్షణ , విముక్తి ఉంటుందని దళిత బహుజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 15 నుంచి అక్టోబర్ 14.2027 వరకూ నిర్వహించే మన ఓటు మన రాజ్యం నినాదం తో దళితులకు రక్షణ రాజ్యాధికారం సాధన కోసం జరిగే సభలు.పాదయాత్రలను విజయవంతం చేయాలనీ దళిత బహుజనులకు పిలుపు ఇచ్చారు.దోపిడీ కులాల మనువాద పార్టీ ల పాలన లో అణగారిన కులాలకు సోషల్ జస్టిస్ జరగదని, అన్యాయం జరుగుతుందని రక్షణ ఉండదన్నారు. ఇలాంటి రాజకీయ దోపిడీ పార్టీ లను ఎన్నికల్లో ఓడించకపోతే దళిత బహుజన సమాజానికి భవిష్యత్తు ఉండదని బానిసత్వం తప్పదన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్. బి. ఆర్. అంబేద్కర్ జీవిత ఆశయం ఐన పీడీత పాలిత సమాజాన్ని పాలక వర్గం గా తీర్చి దిద్దడమే దళిత బహుజన పార్టీ లక్ష్యం అన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతీ దళిత కుటుంబం నకు రెండు ఎకరాల వ్యవసాయం భూమి ని పంపిణీ చేయాలనీ, ఎస్సి. ఎస్టీ చట్టం 1989 ను పటిష్టం గా అమలు పరచాలని, ఎస్సి. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ను విడుదల చేయాలనీ తదితర డిమాండ్లను కోరారు. ఈ మీడియా సమావేశం లో పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఎస్. ఆంజినేయ కుమార్. ఆల్ ఇండియా ఎస్సి. ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ డిడ్ల. విద్యాసాగర్. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.అజయ్ మాలమహానాడు ఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్యక్షులు ఎమ్. పండు జిల్లా మహిళా అధ్యక్షురాలు. బి. ఉషారాణి. నగర యూత్ అధ్యక్షులు కె. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ అశోక్ ఆదేశాలతో జిజిహెచ్‌లో వీధి కుక్కల ఏరివేత

### - ఏబీసీ సెంటర్ కి తరిలింపు



గుంటూరు కార్పొరేషన్, జూన్ 3 ( ప్రభాత వార్త ) : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి (జి. జి. హెచ్)లో వీధి కుక్కల సమస్య పై నగర కమిషనర్ మయూర్ అశోక్ స్పందించారు. కమిషనర్ ఆదేశాలతో నగర పాలక సంస్థ వీదికుక్కల పర్యవేక్షణ అధికారులు రంగం లోకి దిగారు. వెంటనే ఏబీసీ బృందాలు జి. జి హెచ్. నందు వీధి శునకాలను ఏబీసీ సెంటర్ కి తరిలించారు.

## నూతన లలితా హాస్పిటల్ ప్రారంభించిన సీఎం

గుంటూరు క్రైమ్,జూన్3,ప్రభాతవార్త: పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామ పంచాయతీ వద్ద, జాతీయ రహదారి16 సమీపంలో నూతనంగా నిర్మించబడిన పివియస్ లలిత హాస్పిటల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు



సంబంధించి ఆసుపత్రి ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా,బందోబస్తు ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి,గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు చేపట్టిన పలు ముఖ్య భద్రత చర్యలకు దిశానిర్దేశం చేశారు.ఆసుపత్రిలోకి ప్రవేశించే మరియు బయటకు వెళ్లే మార్గాల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించి,అనుమతులు కలిగిన వైద్యులు,ప్రముఖులు,ప్రజలను మాత్రమే కార్యక్రమానికి అనుమతించాలని,ప్రతి ఒక్కరితో మర్యాద పూర్వకంగా,సున్నితంగా వ్యవహరించాలని సూచించారు.వీవీఐపీ,వీఐపీ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలనీ ఆదేశించారు.ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, హెలిప్యాడ్ చుట్టూ ఏర్పాటు చేసిన భారీ కేడింగ్ ను పరిశీలించి,బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యమంత్రి సందర్శించే అన్ని ప్రదేశాలను పోలీసు శాఖ ఆధీనంలోకి తీసుకుని, ప్రత్యేక భద్రత కల్పించాలని ఆదేశించారు.కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి సంబంధించి ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టి,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.వీఐపీలు,ఇతర ప్రముఖులు,ప్రజల వాహనాల పార్కింగ్,రాకపోకల కోసం ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేసి ఎక్కడా ఎటువంటి ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని సూచించారు.కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాలు,డ్రోన్ కెమెరాల సహాయంతో నిరంతర నిఘా,పర్యవేక్షణ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఎ. హనుమంతు(ఏఆర్),నార్త్ డిఎస్పీ మురళీకృష్ణ,స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్,ఏఆర్ డీఎస్పీ సంకురయ్య,పెదకాకాని సీఐ నారాయణస్వామి,ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు...



## కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి..

### - ప్రత్తిపాడు వైసీపీ ఇంచార్జ్ బలసాని




వట్టిచెరుకూరు, జూన్ 3, ప్రభాతవార్త : రెండేళ్ల కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ వద్దనున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి పార్టీ కార్యాలయంలో బుధవారం బలసానితో పాటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి వెన్నుపోటుకు రెండేళ్ల పోస్టర్ ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా బాలసాని మాట్లాడుతూ..వైసిపి పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టనున్న వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని తెలియజేశారు. నేడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఈనెల 8, 9 తేదీలలో సమావేశాలు, 12న జరిగే భారీ ర్యాలీలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుందని వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తోట శ్రీనివాస్ పార్థివ దేహానికి నివాళులు

చిలకలూరిపేట, జూన్ 3, ప్రభాతవార్త: పురుషోత్తమ పట్నంలో తోట శ్రీనివాస్ (ప్రముఖ న్యాయవాది) పార్థివ దేహానికి పూల దండలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మాజీ మంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, బిజెపి పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టిడిపి సత్యం, తేలప్రోలు రామ్మూర్తి, అచ్చుకోలా విజయ్ భాస్కరరావు, తోట బ్రహ్మ స్వాములు, షేక్ కుమిర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కరిముల్లా, మాజీ మున్సిపల్ చైర్మన్ రఫాని, తోట మనోహర్ నాయుడు, మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు

## చిన్మయ మిషన్ 75 సంవత్సరాల చిన్మయ అమృత మహోత్సవాలు

చిలకలూరిపేట, జూన్ 3, ప్రభాతవార్త: చిన్మయ మిషన్ 75 సంవత్సరాల చిన్మయ అమృత మహోత్సవాలు" పురస్కరించుకొని నిర్వహిస్తున్న"చిన్మయ అమృత యాత్ర" ఈరోజు చిలకలూరిపేటకు విచ్చేసిన సందర్భంగా పట్టణంలోని చిన్మయ మిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న శాసన మండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ గారు, శ్రీమతి లలితమ్మ గారు....ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ గారు మాట్లాడుతూ.. స్వామి చిన్మయానంద సరస్వతి గారి ప్రవచనాలు ప్రపంచవ్యాప్తంగా 27 దేశాలకు వ్యాపించి ప్రజల్లో జ్ఞానోదయాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. జ్ఞానం ద్వారా మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రజలు జ్ఞానవంతులైతే ప్రపంచం అద్భుతంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్న హింస, స్వార్థం, ఉగ్రవాదం వంటి అనేక రుగ్మతలకు మూల కారణం జ్ఞానలేమేనని అన్నారు.భగవద్గీత, ఉపనిషత్తులు, వేదాలు వంటి హిందూ ధర్మ గ్రంథాల్లో ఉన్న గొప్ప సందేశాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో స్వామి చిన్మయానంద సరస్వతి గారు ప్రారంభించిన ఈ ఆధ్యాత్మిక ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా 27 దేశాలలో విస్తరించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు.హిందూ ధర్మ ప్రచారం, మానవాళి శ్రేయస్సు కోసం తమ జీవితాలను అంకితం చేసి సేవ చేస్తున్న చిన్మయ మిషన్ సభ్యులందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరావు గారు, రంగారావు గారు, పమిడి శ్రీనివాస్ గారు తదితరులు పాల్గొన్నారు.



## సంగంజాగర్లమూడిలో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షంచిన ఎంపీడీఓ అత్తోట దీప్తి:



తెనాలి జూన్3(ప్రభాతవార్త): తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో,ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ అత్తోట దీప్తి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి వీధిలో పర్యటిస్తూ, గ్రామస్తులతో మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, తదితర సమస్యలపై ప్రజలను అడిగితెలుసుకున్నారు. అనంతరం పంచాయితీ అధికారులు సిబ్బంది తో,సమస్యలపై వచ్చే ప్రజలకు తగు సహాయం అందించాలని, భాద్యతగా వ్యవహరిస్తూ,గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

## తెనాలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భారీగాలికి విరిగిన చెట్టుకొమ్మ



తెనాలి జూన్3(ప్రభాతవార్త): తెనాలి పట్టణంలోని కొత్తపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో ఉన్న భారీ వృక్షం పైభాగం గత వారం కురిసిన ఈదురుగాలులకు విరిగి ప్రమాదకర స్థితిలో వేలాడుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గత వారం సంభవించిన భారీ గాలివానకు కార్యాలయ ఆవరణలోని చెట్టుకు సంబంధించిన భారీ కొమ్మ విరిగిపోయింది. అయితే ఆ కొమ్మ పూర్తిగా నేలకూలకుండా అటూ ఇటూ కాకుండా ఇతర కొమ్మల మధ్య చిక్కుకుని వేలాడుతోంది. అంతేకాకుండా విరిగిన కొమ్మలో కొంతభాగం పక్కనే ఉన్న కరెంటు స్తంభంపై కూడా ఒరిగి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం వందలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్ల కోసం రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. కార్యాలయ ఆవరణలోనే ఈ కొమ్మ ప్రమాదకరంగా వేలాడుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సందర్శకులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. కరెంటు స్తంభంపై ఒరిగి ఉండటం వల్ల విద్యుత్ తీగలు తెగిపడి షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదంతో పాటు ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా స్పందించి ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్టు కొమ్మను తొలగించాలని కోరుతున్నారు. పెను ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సర్ పై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలి..

### - ప్రతీ ఓటు మ్యాపింగ్ చేయాలి.. ఎమ్మెల్యే రామాంజనేయులు.

వట్టి చెరుకూరు జూన్ 3, ప్రభాతవార్త : ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సర్ పై ప్రత్తిపాడు




నియోజకవర్గ స్థాయి వర్క్ షాప్‌కు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ..ఎన్నికల్లో ఓటర్ల జాబితాల ఆధారం చేసుకుని వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సర్ ప్రక్రియపై రాష్ట్రస్థాయి నేతలు మొదలుకుని గ్రామస్థాయి వరకు ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవడమే కాకుండా.. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మహానాడును వర్చువల్‌గా అద్భుతంగా నిర్వహించుకున్నాం. వర్చువల్‌గా మహానాడు ఈస్థాయిలో నిర్వహించుకోవడం సాధ్యమా? అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ విజయవంతం చేసుకోగలిగామని వెల్లడించారు. ఇప్పుడు పార్టీ యంత్రాంగంపై అతిపెద్ద కీలక బాధ్యత ఉందని, ప్రతీ 2025 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని గుర్తు చేశారు. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని సర్ ప్రక్రియను చేపడుతున్నారని, జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పరిపూర్ణంగా పూర్తి కావాలన్నారు. అవసరమైతే మూడోసారి కూడా ఇళ్లకు వెళ్లి ఓట్ల పరిశీలన జరపాలని, బిఎల్‌ఓలతో పాటు మన పార్టీకి చెందిన బిఎల్‌ఏలు కూడా వెళ్లాలని సూచించారు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత అన్నారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలమని, పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వం మరింత బలంగా ఉంటుందని పేర్కొన్నారు. సర్ పై ప్రతీ రోజూ మానిటర్ చేస్తూ మన ఓట్లు ఉన్నాయా? లేవా? అనేది నిరంతరం చూసుకోవాలని క్లస్టర్ ఇన్చార్జిలకు సూచించారు. మన ప్రాంతానికి చెందిన స్థానికులు కొందరు వివిధ రకాల కారణాలతో ఇతర ప్రాంతాలలో ఉంటారని, వారి ఓట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాలని, రెండేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. 45 రోజుల్లో సైకిళ్లపై వెళ్లి ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉందన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ.. పార్టీ పదవుల్లోనూ సోషల్ రీఇంజనీరింగ్ చేపడుతున్నాం. కార్యకర్తల సాధికారత గురించి ఆలోచించాలి... కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని టీడీపీ తప్ప ఏ పార్టీ పెట్టలేదని, చనిపోయిన కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, మండల టిడిపి అధ్యక్షులు మర్రి సాంబశివరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం టిడిపి యువనేత నాగిశెట్టి నాగరాజు, ఐదు మండలాల టిడిపి అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

